సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023



అమ్మయ్య!
తల్లీ బిడ్డా సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రసవాలకు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తోంది. దీంతో ఆస్పత్రిలో ప్రసవాలు పెరుగుతున్నాయి.
8లో



రత్నగిరి దర్శనం
అన్నవరం: రత్నగిరిపై కొలువుదీరిన సత్యనారాయణ స్వామి ఆలయానికి మంగళవారం పదివేల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకున్నారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి మంగళవారం గోదావరి డెల్టా కాలువలకు 6,895 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,030, మధ్య డెల్టాకు 1,325 ,పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

మంత్రి విశ్వరూప్‌తో ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్ భేటీ



మంత్రి విశ్వరూప్‌ను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన రాష్ట్ర మాదిగ పొలిటికల్ జేసీసీ చైర్మన్ బొమ్మి ఇజ్రాయిల్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అమలాపురంలో మంత్రి విశ్వరూప్ బసచేసిన సర్ ఆర్థర్ కాటన్ అతిథి గృహంలో ఆయనను ఇజ్రాయిల్ మంగళవారం రాత్రి కలిశారు. సామాన్యుడైన తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల ఇజ్రాయిల్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి విశ్వరూప్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ మంత్రి విశ్వరూప్‌కు పుష్పగుచ్ఛం అందించారు.

ఓఎన్‌జీసీ భూములను పరిశీలించిన జేసీ



ఓడలరేవులోని ఓఎన్‌జీసీ భూములను పరిశీలిస్తున్న జేసీ ధ్యానచంద్ర

అల్లవరం: ఓడలరేవులోని ఏపీఐఐసీకి చెందిన, ఓఎన్‌జీసీ కార్యకలాపాలు నిర్వహిస్తున్న 330 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించే నిమిత్తం జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్, ఆర్ఐ దుర్గా శ్రీనివాస్, వీఆర్‌ఓ, సర్వేయర్లు పాల్గొన్నారు.

కోనసీమ జిల్లా చెస్ కన్వీనర్‌గా సురేష్



అమలాపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ కన్వీనర్‌గా అమలాపురానికి చెందిన తాడి వెంకట సురేష్ ఎంపికయ్యారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పడిన జిల్లాలకు చెస్ అసోసియేషన్ కన్వీనర్లను నియమించారు. కోనసీమ జిల్లాకు సురేష్‌ను కన్వీనర్ గా నియమించినట్లు రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రతినిధులు తెలియజేశారు.

24న జాబ్‌మేళా

అమలాపురం రూరల్: అపోలో, ఎస్‌బీఐ లైఫ్ కంపెనీల్లో పని చేయడానికి ఈ నెల 24 ఉదయం 10.30 గంటలకు అమలాపురంలోని ఉపాధి కార్యాలయం వద్ద జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి ఐ.వసంతలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీతం రూ.10 వేల నుంచి రూ.20 వేలు ఉంటుందని, అమలాపురం పరిసర ప్రాంతాల్లో పని చేయవలసి ఉంటుందని తెలిపారు. 10వ తరగతి, డిగ్రీ ఫార్మసీ ఉత్తీర్ణత సాధించిన యువతీయువకులు సర్టిఫికెట్స్, బయోడేటాలతో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 9642255545 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నిత్యకల్యాణం... పచ్చ తోరణం

అన్నవరం: సత్యనారాయణ స్వామి దేవస్థానంలో నిత్య కల్యాణ వేదికను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇందుకు రూ.రెండు లక్షలు విరాళంగా సమర్పించేందుకు దాత ఒకరు ముందుకు వచ్చారు. ఇంకా ఎక్కువ ఖర్చయినా కల్యాణ వేదికను బాగా తీర్చిదిద్దాలని భావిస్తున్నట్లు ఈఓ సత్యనారాయణ మూర్తి మంగళవారం 'సాక్షి'కి తెలిపారు. సత్యదేవుడు, దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి 50 ఏళ్లుగా నిత్యం కల్యాణం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రధానాలయం పక్కనే నిత్యకల్యాణ మంటపంలో ఉదయం 9 గంటల నుంచి 11-30 గంటల వరకు దీనిని నిర్వహిస్తారు. రూ.1,116 టిక్కెట్‌తో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించి పులకిస్తుంటారు. ఏటా వైశాఖ మాసంలో శుద్ధ దశమి నుంచి బహుళ పాడ్యమి వరకు ఏడు రోజులు మినహా మిగిలిన 358 రోజులు కల్యాణం జరుగుతుంది.

ఘనంగా నిర్వహణ
సోమవారం నిత్యకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11-30 గంటల వరకు కల్యాణ బ్రహ్మ ఛామర్తి కన్నబాబు, అంగర సతీష్ శర్మ, అర్చకుడు కోట సుబ్రహ్మణ్యం నిర్వహించారు. 15 మంది భక్తులు రూ.1,116 టిక్కెట్ కొనుగోలు చేసి కల్యాణంలో పాల్గొన్నారు. ఏటా ఐదు వేలకు పైగా భక్తులు కల్యాణంలో పాల్గొంటున్నారు. దీని వలన దేవస్థానానికి రూ.50 లక్షలకు పైగా ఆదాయం సమకూరుతోంది. భక్తులు స్వామి, అమ్మవార్లకు కట్నకానుకల రూపంలో, పట్టువస్త్రాల రూపంలో మరో రూ.ఐదు లక్షల వరకు సమర్పిస్తుంటారు.

విజయపంకాయే..



జెడ్పీటీసీ సభ్యులు - 59

వైఎస్సార్ సీపీ	-	58
టీడీపీ	-	1

రాజీనామా : కడియం, కోటనందూరు
ఎన్నిక జరగనిది : రాజమండ్రి రూరల్

ఎంపీటీసీ సభ్యులు (పార్టీల వారీ)

వైఎస్సార్ సీపీ	-	840
టీడీపీ	-	115
జనసేన	-	94
ఇండిపెండెంట్	-	21

మున్సిపాలిటీలు	-	7
మొత్తం (కౌన్సిలర్లు)	-	266
రెవెన్యూ డివిజన్లు	-	8
మొత్తం ఓటర్లు	-	1,436

- 'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నిక ఏకపక్షమే
- మూడొంతుల ఓట్లు వైఎస్సార్ సీపీవే
- భంగపాటు తప్పదని టీడీపీ బెంగ
- ఎటూ తేల్చుకోలేని సందిగ్ధత

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక వైఎస్సార్ సీపీకి ఏకపక్షమే కానుంది. టీడీపీకి చెందిన మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు పదవీ కాలం ముగియడంతో ఖాళీ అయిన స్థానానికి ఎన్నిక నోటిఫికేషన్ వెలువడిన సంగతి తెలిసిందే. దీనికి నామినేషన్ ప్రక్రియ కూడా మొదలైంది. ఈ స్థానం నుంచి తమ అభ్యర్థిగా ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావును వైఎస్సార్ సీపీ ప్రకటించింది. ఈయన మంగళవారం నామినేషన్ కూడా వేశారు. కుడుపూడి నామినేషన్‌ను 10 మంది స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రతిపాదించారు.

పూర్తి ఆధిపత్యం
ఉమ్మడి తూర్పులోని జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు ఓటర్లుగా ఉన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు 2021 ఏప్రిల్ 9న పోలింగ్ జరిగింది. న్యాయపరమైన చిక్కులతో ఫలితాల ప్రకటన కోసం అభ్యర్థులు ఆ ఏడాది సెప్టెంబర్ 19 వరకు వేచి చూడాల్సి వచ్చింది. ఆ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అప్రతిహతమైన విజయాన్ని సాధించింది. ఎన్నికలు జరిగిన జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల్లో ఒకటి మినహా అన్ని స్థానాల్లోను విజయదుందుభి మోగించింది. జిల్లా పరిషత్ పీఠాన్ని కైవసం చేసుకుంది. జిల్లా పరిషత్ చరిత్రలో ఇదొక రికార్డుగా నిలిచిపోయింది.

పరిషత్‌లోనూ పైచేయి
మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, మున్సిపల్ వార్డులకు జరిగిన ఎన్నికల్లో కూడా 85 శాతం పైగా స్థానాలలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసింది. తాజాగా ఇప్పుడు జరుగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో వీరంతా ఓటర్లే. రాజమహేంద్రవరం, కాకినాడ నగరపాలక సంస్థల పదవీకాలం ముగియడంతో ఆ రెండు చోట్లా ఎన్నికైన కార్పొరేటర్లు మాజీలయ్యారు. తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, మండపేట, రామచంద్రపురం, అమలాపురం మున్సిపాలిటీలు, ముమ్మిడివరం, ఏలేశ్వరం, గొల్లప్రోలు నగర పంచాయతీలలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడింది. ఈ క్రమంలో అన్నింటా వైఎస్సార్ సీపీ హవా కొనసాగుతోంది. అధిక సంఖ్యాబలమున్న వైఎస్సార్ సీపీకి ఎమ్మెల్సీ ఎన్నిక విజయం ఏకపక్షమే కానుంది.

పోటీ చేస్తే భంగపాటు



నామినేషన్ల పర్వం మొదలయ్యాక తొలి నామినేషన్ వైఎస్సార్ సీపీ నుంచే దాఖలైంది. తెలుగుదేశం పార్టీ అసలు బరిలోకి దిగాలా వద్దా అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతోంది. ఒకప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఈ పార్టీకి కంచుకోటగా ఉండేది. కోటలన్నీ కుప్పకూలాయి. వైఎస్సార్ సీపీ ప్రభంజనం ముందు పేకమేడల్లా ఒరిగిపోయాయి. వరుస పరాజయాలతో డీలా పడిన తెలుగు తమ్ముళ్లు చెల్లాచెదురయ్యారు. బలంతో సంబంధం లేకుండా రాజకీయ పార్టీ అన్న తరువాత పోటీ చేయాల్సిందేనని టీడీపీలో కొందరు నేతలు పట్టుబడుతున్నట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం పోటీ అంశంపై వీరు చర్చించారని తెలిసింది. జనసేన, ఇతర స్వతంత్రులతో కలిసి బరిలో దిగాలని కోనసీమకు చెందిన కొందరు నాయకులు ప్రతిపాదించారని సమాచారం. ఎన్నికకు వెళ్లాలంటే డబ్బుతో కూడుకున్న పని అని.. ఆ భారం మోసేందుకు ఎవరు ముందుకు వస్తారని పార్టీ నేతల మధ్య చర్చ జరిగింది. ఈ బాధ్యతను భుజాన వేసుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదంటున్నారు. డిపాజిట్టు కూడా దక్కే పరిస్థితి లేనప్పుడు పోటీచేసి అభాసుపాలవ్వడం సరికాదని పార్టీ సీనియర్లు భావిస్తున్నారని భోగట్టా. పోటీకి దూరంగా ఉండటమే మంచిదని మెజార్టీ నేతలు అభిప్రాయపడ్డారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి కుడుపూడి సూర్యనారాయణరావుకు మద్దతుగా కలెక్టరేట్‌కు వచ్చిన మంత్రులు దాడిశెట్టి రాజా, పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణు, ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, చింతా అనురాధ, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు

అట్టహాసంగా కుడుపూడి నామినేషన్

- తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- కాకినాడ కలెక్టరేట్‌లో కోలాహలం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు మంగళవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఉమ్మడి జిల్లాల నలుమూలల నుంచి పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఒక సెట్ నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలక్కియాకు ఆయన అందజేశారు. నామినేషన్ ఘట్టం మొదలయ్యాక వైఎస్సార్ సీపీ నుంచే తొలి నామినేషను దాఖలైంది. పది మంది స్థానిక సంస్థల ప్రతినిధుల సంతకాలతో కుడుపూడి అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. అంతకుముందు ఆయన అమలాపురం నుంచి పార్టీ అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా మేళతాళాల మధ్య కలెక్టరేట్ చేరుకున్నారు. కలెక్టరేట్ వద్ద మంత్రులు దాడిశెట్టి రాజా, పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, చింతా అనురాధ, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, పార్టీ కాకినాడ, కోనసీమ జిల్లాల అధ్యక్షులు కురసాల కన్నబాబు, పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తికుమార్, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి మునికుమారి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్, రాజానగరం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు వట్టికూటి రాజశేఖర్, పార్టీ కార్యదర్శులు మట్టపర్తి నాగేంద్ర, నాయుడు పాల్గొన్నారు.

బలహీనవర్గాలకు సముచిత స్థానం
ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ముఖ్యమంత్రి జగన్ సముచిత స్థానం కల్పించారని మంత్రులు విశ్వరూప్, శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, దాడిశెట్టి రాజా పేర్కొన్నారు. సూర్యనారాయణరావు నామినేషన్ దాఖలు అనంతరం మంత్రులు కలెక్టరేట్‌లో విలేకర్లతో మాట్లాడారు. కార్పొరేట్ దిగ్గజాలకు మాత్రమే సాధ్యమయ్యే ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థానాలను జగన్‌మోహన్ రెడ్డి సామాన్యులకు కేటాయించి రాజకీయంగా ముందడుగు వేసేందుకు అవకాశం కల్పించారన్నారు. సీఎంకు తానెప్పుడూ రుణపడి ఉంటానని కుడుపూడి కృతజ్ఞతలు తెలిపారు.

చుంచులా మైనర్ డ్రెయిన్‌కు మోక్షం

- రూ.6.88 లక్షలతో పూడికతీత పనులు
- కలెక్టర్ హిమాన్షు శుక్లా



పూడికతీత అనంతరం వెడల్పుగా ఉన్న చుంచులా డ్రెయిన్

అల్లవరం: సెంట్రల్ గోదావరి డెల్టా పరిధిలోని అల్లవరం మండలం బెండమూర్లంక వద్ద పంచనీటి మీడియం డ్రెయిన్‌కు అనుబంధంగా మురుగునీరు దిగే చుంచులా మైనర్ డ్రెయిన్‌కు మోక్షం లభిస్తుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.6.88 లక్షలతో చుంచులా మైనర్ డ్రెయిన్‌లో పూడికతీత పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీంతో చుంచులా మైనర్ డ్రెయిన్ పరిధిలో 1,400 ఎకరాల విస్తీర్ణంలో ఆయకట్టుకి ప్రయోజనం లభిస్తుంది. కొంతకాలంగా చుంచులా మైనర్ డ్రెయిన్ ఆధునీకరణకు నోచుకోక పంచనీటి కాలువను ఆనుకుని ఉన్న ఆయకట్టులో ముంపునీరు స్తంభించేది. చుంచులా మైనర్ డ్రెయిన్‌పై ప్రత్యేక చొరవ తీసుకుని ప్రణాళిక ప్రకారం జిల్లాలోని వివిధ డ్రెయిన్ల పూడికతీత పనులు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ క్షేత్రాలు, బెండమూర్లంక గ్రామం ముంపునకు గురి కాకుండా ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.6,88,157 మంజూరు చేసి పూడికతీత పనులకు అనుమతులు జారీ చేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు. కాకినాడ డ్రెయిన్స్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పూడికతీత పనులు ప్రారంభించామన్నారు. పూడికతీత పనులు చేపట్టడంతో చుంచులా డ్రెయిన్ సామర్థ్యం పెరిగి ఆయకట్టు నుంచి ప్రవహించే మురుగునీరు వేగంగా వెనక్కి తగ్గుతుందని, వర్షాకాలంలో పంటలకు నష్టం వాటిల్లదని తెలిపారు.

పంట పొలాల పరిశీలన



పి.మల్లవరం శివారు గ్రాంటు గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

తాళ్లరేవు: మండల పరిధిలోని పలు గ్రామాలలో నెలకొన్న సాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడుతున్నట్లు జల వనరుల శాఖ, డ్రైనేజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్బయ్య తెలిపారు. కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు మండల పరిధిలోని శివారు ప్రాంతాలలోని పంట పొలాలను ఆయన వ్యవసాయశాఖ ఈఈ విజయ్‌కుమార్, కాకినాడ ఆర్డీఓ బీవీ రమణ, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఏఓ ఎస్.ప్రశాంతితో కలిసి పర్యటించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమై సమస్య పరిష్కారానికి చర్యలపై చర్చించారు. తక్షణమే ఇంజన్ల ద్వారా నీటిని తోడుకునే విధంగా, అవసరమైన చోట క్రాస్‌బండ్‌లు వేయించి రైతులకు నీటిని అందించాలని ఇరిగేషన్ ఏఈ ఈశ్వర్‌కు సూచించారు. ఈ సమావేశంలో డ్రైనేజి ఏఈ సునీత, ఆర్ఐ తేజ, పి.మల్లవరం పంచాయతీ కార్యదర్శి ఎస్.వెంకట రమణ ఉన్నారు.

ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటి సరఫరా
శివారు ప్రాంతాల్లో సాగునీటి ఎద్దడి నివారణకు చర్యలను వేగవంతం చేసినట్లు జలవనరుల శాఖ ఎస్ఈ జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మల్లంకోట లాకుల వద్ద ఏర్పాటు చేసిన పంపింగ్ మోటార్లను ఆయన ఎంపీపీ రాయుడు సునీతతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆత్రేయనదిలో నీటిని ఎత్తిపోతల ద్వారా సైఫన్‌లోకి తోడి బుధవారానికల్లా శివారు ప్రాంతాలైన పత్తిగొంది, గ్రాంటు, మూలపాలం, నీలపల్లి తదితర ప్రాంతాలకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. రైతాంగానికి నీటి ఎద్దడి రాకుండా ప్రతీ ఎకరాకు నీరు అందించాలని ఎంపీపీ సునీత ఎస్ఈ శ్రీనివాస్‌ను కోరారు. వారి వెంట వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు ఉన్నారు.

ఆక్వా రైతుకు హాయితీ

- కలెక్టర్ ఆదేశంతో వేగంగా 'ఆక్వా జోనేషన్' రీ సర్వే
- విద్యుత్ రాయితీ సర్వీసుల పునరుద్ధరణకు అవకాశం



ఆక్వా చెరువులలో తిరుగుతున్న ఏరియేటర్లు

సాక్షి అమలాపురం: రైతు ఎవరైనా... సాగు ఏదైనా... వారికి ఏ రూపంలోనూ నష్టం జరగకుండా చూడడమే తమ తొలి ప్రాధాన్యం అని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి చేతలలో చూపించింది. ఈ-ఫిష్ సర్వేలో చోటు చేసుకున్న లోపాలను సవరించి రైతులకు విద్యుత్ రాయితీ పునరుద్ధరించేందుకు మార్గం సుగమం చేసింది.

జిల్లాలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఈ-ఫిష్ సర్వే జరిగింది. సర్వేలో చోటు చేసుకున్న లోపాల వల్ల ఆక్వాకు ప్రభుత్వం అందిస్తున్న విద్యుత్ రాయితీని పలువురు రైతులు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. జిల్లావ్యాప్తంగా 5,862 సర్వీసులకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున రాయితీ విద్యుత్ అందజేస్తున్నారు. ఈ - ఫిష్ సర్వే లోపాల వల్ల సుమారు 3,900 మందికి పైగా రాయితీ కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. దీనిపై కోనసీమ ఆక్వా రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రైతులు ఆందోళనకు దిగారు. ఆక్వా రంగం సంక్షోభంలో ఉన్నా విద్యుత్ రాయితీ భరోసా వల్లే సాగు చేస్తున్నామని వారు విషయాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టికి తీసుకుని వెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు మత్స్యశాఖ అధికారులు ఆక్వా జోనేషన్ సర్వే చేపట్టి లోపాలు సవరించారు. దీని వల్ల గతంలో రాయితీ విద్యుత్ పొందుతున్న 90 శాతం మంది తిరిగి రాయితీ పొందేందుకు వీలు కలిగింది.

జిల్లాస్థాయి సలహా కమిటీ ఆమోదం పొందిన ఈ నివేదికను రాష్ట్రస్థాయిలో హైపర్ కమిటీ ఆమోదించిన తరువాత విద్యుత్ రాయితీ సర్వీసుల పునరుద్ధరణ జరగనుంది. అలాగే ఆక్వాజోనేషన్ రీ సర్వే ఆధారంగానే రైతులు సాగు అనుమతికి ధ్రువీకరణ పత్రాలు పొందనున్నారు.

ప్రభుత్వ స్పందన భేష్
ఈ-ఫిష్ సర్వే వల్ల మాకు నష్టం జరుగుతుందని చెప్పగానే జిల్లా యంత్రాంగం స్పందించి ఆక్వా జోనేషన్ సర్వే చేయడం అభినందనీయం. ఆక్వా రైతుల విషయంలో ప్రభుత్వ స్పందన భేష్ అని కోనసీమ ఆక్వా రైతు పరిరక్షణ సమితి గౌరవాధ్యక్షుడు, అధ్యక్షుడు త్సవటపల్లి నాగభూషణం, రుద్రరాజు నానీ రాజు తెలిపారు. ఆక్వాకు విద్యుత్ రేట్లు తగ్గించారు. కరోనా సమయంలో రొయ్యలు కొనుగోలు చేయించారు. మూడు నెలల క్రితం మేత ధరలు తగ్గించడంతోపాటు.. రొయ్యలు కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆక్వా రైతులకు ఇన్ని విధాలుగా ప్రయోజనం కల్పించిందని వారు గుర్తు చేశారు. డీఎల్‌సీ పంపిన నివేదికను హైపర్ కమిటీ యథావిధిగా ఆమోదిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

3,878 హెక్టార్లకు డీఎల్‌సీ ఆమోదం



మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా

ఇ -ఫిష్ సర్వేలో ప్రతిపాదించిన 3,878 హెక్టార్ల విస్తీర్ణానికి ఆక్వాకల్చర్ జిల్లా సమన్వయ కమిటీ ఆమోదం తెలిపిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. పాత విస్తీర్ణంతో కలిపి జిల్లావ్యాప్తంగా 15,928 హెక్టార్లు ఆక్వాజోన్ పరిధిలోకి రానున్నదని తెలిపారు.

కలెక్టరేట్‌లో మంగళవారం ఆక్వా కల్చర్ జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో 2018 సంవత్సరంలో దశలవారీగా నిర్వహించిన ఆక్వా జోనేషన్ సర్వే పైన, జిల్లాలో ఇ-ఫిష్ సర్వే, విద్యుత్ కనెక్షన్ల సబ్సిడీ అందజేత, ఆక్వా జోన్ డిక్లరేషన్ కింద కొత్తగా అనువైన ప్రాంతాన్ని గుర్తించడం కోసం నిర్వహించిన రీసర్వే, గ్రామ సభల ఏర్పాటు, ఆక్వా జోన్ ప్రాంతాన్ని సుస్థిర ఆక్వాజోన్ మ్యాపింగ్‌గా మార్చడానికి ఆమోదం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై సమీక్షించారు. ఫిషరీస్ జేడీ షేక్ లాల్ మహమ్మద్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏఐసీసీలో జిల్లా నుంచి ఆరుగురు

అమలాపురం టౌన్: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నూతన సభ్యుల నియామకంలో జిల్లాకు చెందిన ఆరుగురు సీనియర్ నేతలకు చోటు దక్కింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో వీరి ఎంపిక జరిగింది. జిల్లా నుంచి ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, కో ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు కేబీఆర్ నాయుడు, జిల్లా పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, పార్టీ సీనియర్ నేతలు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్రలకు ఈ నూతన కమిటీలో స్థానం లభించింది. అమలాపురం పట్టణ పార్టీ అధ్యక్షుడు ఒంటెద్దు బాబి అధ్యక్షతన మంగళవారం స్థానిక ముమ్మిడివరం గేటు సెంటర్‌లో జరిగిన సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, నాయకులు వీరి నియామకంపై హర్షం వ్యక్తం చేశారు.

నేషనల్ అంపైర్‌గా శ్రీనివాసరావు



అమలాపురం రూరల్: మహారాష్ట్రలోని పూణేలో బుధవారం నుంచి ఈ నెల 28 వరకు జరిగే 75వ అంతర్రాష్ట్ర అంతర్ జోన్ పోటీలు, 84 జాతీయ చాంపియన్ షిప్ పోటీలకు కొంకాపల్లికి చెందిన పాయసం శ్రీనివాసరావు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ అంపైర్‌గా ఎంపికయ్యారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఉత్తర్వులు అందాయని తెలిపారు. ఏపీ నుంచి తనకు అవకాశం రావడం గర్వంగా ఉందని చెప్పారు. శ్రీనివాసరావును ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ అంకమ్మ చౌదరి, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం అభినందించారు.

క్లుప్తంగా

'దాట్ల'కు కథా గౌరవ పురస్కారం


పురస్కారానికి ఎంపికైన దాట్ల దేవదానంరాజు

యానాం: యానాం పట్టణానికి చెందిన ప్రముఖ కవి, కళైమామణి దాట్ల దేవదానంరాజు మధునాపంతుల ఫౌండేషన్ వారి కథా గౌరవ పురస్కారానికి ఎంపికయినట్లు మంగళవారం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కిరణ్ మధునాపంతుల ప్రకటనలో తెలిపారు. దేవదానం రాజుతో పాటు మరో ఇద్దరు కథకులు అనామకుడు, ముక్కామల చక్రధర్‌కు ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. మార్చి 5న పల్లిపాలెం మధునాపంతుల ఫౌండేషన్ స్కూలులో జరిగే సభలో పురస్కారాన్ని అందించనున్నట్లు తెలిపారు. పురస్కారంలో భాగంగా ఇద్దరికి రూ.20వేల చొప్పున నగదు, ముక్కామల చక్రధర్‌కు రూ.10వేల నగదు, సత్కారం, జ్ఞాపిక అందజేస్తామన్నారు. దాట్ల దేవదానం రాజు గతంలో పుదుచ్చేరి సీఎం రంగసామి చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మకమైన కళైమామణి, తెలుగు రత్న అవార్డులను స్వీకరించారు. ఆయన ఐదు కథా సంపుటాలు, ఏడు కవితా సంపుటాలు, రెండు దీర్ఘకవితలు, యానాం చరిత్ర గ్రంథం, రాజకీయ వ్యంగ్య కథనాలు, చైనాయానాం యాత్రాకథనం, చమత్కారాలు, యానాం కథలు రచించి పలువురి ప్రశంసలు పొందారు. పురస్కారాలకు ఎంపికైనవారికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ప్రముఖ కవి శిఖామణి, ముమ్మిడి చిన్నారి, చింతా కొండలరావు, మధునాపంతుల అభినందనలు తెలిపారు.

మిలేకల్ క్యాంపస్ డ్రైవ్‌లో ఆదిత్య విజయం

బాలాజీచెరువు: తమ కళాశాలలో మిలేకల్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 50 మంది ఉద్యోగాలు సాధించారని ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డి మంగళవారం తెలిపారు. ఎంపికైన ఎంబీఏ విద్యార్థులకు రూ.6.60 లక్షలతో పాటు ఇతర ప్రోత్సాహకాలు సంస్థ కల్పిస్తుందన్నారు. ఆరు నెలల శిక్షణ కాలంలో స్టైపెండ్ రూ.10వేలు అందజేస్తారని, బీకామ్, బీబీఏకు చెందిన విద్యార్థులు ఇందులో ఉన్నారన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, ప్రిన్సిపాల్ కరుణ అభినందించారు.

అమ్మయ్య!

- నూరుశాతం ప్రసవాలు హాస్పిటల్స్‌లోనే..
- ఆరోగ్యశ్రీ వర్తింపు, తల్లి ఖాతాలో రూ.6 వేలు జమ
- సత్ఫలితాలు ఇస్తున్న ప్రభుత్వ చర్యలు
- ప్రజల్లో పెరిగిన అవగాహన


గర్భిణికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ముమ్మిడివరం: గతంలో ఎంతగా పురిటి నొప్పులు పడుతున్నా ప్రసవానికి ఆసుపత్రికి వెళ్లేవారు చాలా తక్కువగా ఉండేవారు. ఊళ్లో ఉన్న మంత్రసాని ద్వారా ఇంట్లోనే పురుడు పోసేవారు. ఇప్పుడు తల్లీ బిడ్డా సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రసవాలకు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తోంది. దీంతో ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరుగుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం, రామచంద్రపురం ఏరియా ఆసుపత్రులతోపాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరుగుతున్నాయి. ఇవికాకుండా గుర్తింపు పొందిన 50కి పైగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లోనే కాన్పులు చేస్తున్నారు. వీటిలో కొన్నింటికి ఆరోగ్యశ్రీ సౌకర్యం కూడా ఉంది. ఆసుపత్రిలోనే ప్రసవం చేయించుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రైవేటు హాస్పిటల్స్‌లో ప్రసవాలకూ ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తోంది. రూ.6వేలు తల్లుల ఖాతాలో జమ చేస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సత్ఫలితాలను ఇస్తోంది. ఒకప్పుడు ఇళ్లలో కాన్పులు చేయించుకునేవారు ఇప్పుడు ఆసుపత్రుల్లో చేరుతున్నారు.

నాలుగేళ్లలో ప్రసవాలు ఇలా..

సంవత్సరం	ప్రభుత్వ ఆసుపత్రులలో	ప్రైవేటు ఆసుపత్రులలో
2019-20	6,059	.....
2020-21	5,299	......
2021-22	5,283	16,822
2022-23 (జనవరి వరకు)	4,223	10,500


గర్భిణిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

ప్రభుత్వ ఆసుపత్రుల వైపే మొగ్గు

జిల్లాలో పేద, మధ్య తరగతి కుటుంబీకులు అధిక శాతం ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవం చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. నిపుణులైన వైద్యులు, నర్సులు, సిబ్బంది ఉండటం, నిరంతరం పర్యవేక్షణ ఉంటుందనే ఉద్దేశంతో పాటు రూపాయి ఖర్చు కావడం లేదు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు ఉచితం



ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులు వరం లాంటివి. ఇక్కడ ప్రసవాలు పూర్తిగా ఉచితం. గర్భిణి ఇంటి నుంచి ఆసుపత్రికి రావడానికి 108 అంబులెన్స్, డిశ్చార్జి అనంతరం ఇంటికి వెళ్లేందుకు 102 వాహన సౌకర్యం ఉంటుంది. శిశువుకి మొదటి టీకా వేయించేలోగా రూ.6వేలు తల్లి ఖాతాలో జమ అవుతుంది. ఈ సొమ్ము ఆమె పౌష్టికాహారం తీసుకునేందుకు, తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– ఎం.దుర్గారావు దొర, వైద్య ఆరోగ్య శాఖాధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

సీఎం జగన్‌కు ఎంపీ భరత్‌రామ్ కృతజ్ఞతలు


సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వెంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: శాసన మండలి అభ్యర్థుల కేటాయింపులో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో జగన్‌ను కలిశారు.

ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగా స్థానిక సంస్థలు, ఎమ్మెల్యే కోటా, గవర్నర్ కోటాలో 18 స్థానాలకు గాను 11 స్థానాలలో బీసీ వర్గీయులను ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీ వెంట వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, గుర్రం గౌతమ్, కాంతారామ్ పాటిల్ ఉన్నారు.

పార్టీ ప్రముఖులతో ఎమ్మెల్సీ అభ్యర్థి భేటీ


మిధున్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్న పద్మశ్రీ. చిత్రంలో ఎమ్మెల్యే ద్వారంపూడి, కర్రి నారాయణరావు

కాకినాడ: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన కర్రి పద్మశ్రీ మంగళవారం పలువురు వైఎస్సార్ సీపీ ప్రముఖులను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డితో కలిసి ఆమె విజయవాడలో ఎంపీ విజయసాయిరెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఉభయగోదావరి జిల్లాల పార్టీ ప్రాంతీయ పరిశీలకులు మిధున్‌రెడ్డిలను కలిసి తన అభ్యర్థిత్వానికి మద్దతు పలికి ఎంపిక చేయడంపై ధన్యవాదాలు చెప్పారు. ఆమె వెంట భర్త కర్రి నారాయణరావు ఉన్నారు.

క్రీడాస్ఫూర్తిని చాటుతూ..


కేరళ, రాజస్థాన్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతున్న దృశ్యం

జాతీయ వుమెన్ సీనియర్స్ హాకీ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న జాతీయ వుమెన్ సీనియర్స్ హాకీ చాంపియన్ షిప్ పోటీలు మంగళవారం క్రీడాస్ఫూర్తిని చాటే విధంగా జరిగాయి. మొదటి మ్యాచ్ కేరళ, రాజస్థాన్ జట్ల మధ్య జరిగింది. కేరళ జట్టు 4-0 స్కోర్‌తో విజయం సాధించింది. క్రీడాకారిణి ఆర్య ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకుంది. డీఎస్ఏ హాకీ కోచ్ నాగేంద్ర ఈ అవార్డును అందజేశారు. రెండో మ్యాచ్‌లో చండీఘడ్, గోవా జట్లు పోటీ పడ్డాయి. చండీఘడ్ 4-0 స్కోర్‌తో విజయం సాధించింది. క్రీడాకారిణి రాఖి ప్లేయర్ ఆఫ్ ది అవార్డును తీసుకుంది. మూడో మ్యాచ్‌లో ఢిల్లీ, తెలంగాణ జట్లు తలపడ్డాయి. ఢిల్లీ జట్టు 8-0 స్కోర్ తేడాతో విజయం సొంతం చేసుకుంది. క్రీడాకారిణి రూబి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గెలుచుకుంది. నాలుగో మ్యాచ్‌లో జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ పోటీపడ్డాయి. 12-0 జార్ఖండ్ విజయం కైవశం చేసుకుంది. ఐదో మ్యాచ్‌లో హర్యానా, అస్సాం జట్లు పోటీ పడ్డాయి. హర్యానా జట్టు 9-1 స్కోర్‌తో విజయం సాధించింది. క్రీడాకారిణి అల్కా డంగ్‌డంగ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును పొందింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లను హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్ రాయ్, కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, కోశాధికారి పీటర్, టోర్నమెంట్ కో-ఆర్డినేటర్ వి.రవిరాజు, పరిశీలకుడు భూపేంద్ర సింగ్, డైరెక్టర్ మహేష్, విక్రమ్ పర్యవేక్షించారు.

ఘనంగా మహారుద్రయాగం


ప్రత్యేక అలంకరణలో శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి


మంత్రి రాజాకు జ్ఞాపికను బహూకరిస్తున్న మహారుద్రయాగ కమిటీ

రాయవరం: మండలంలోని సోమేశ్వరం శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహారుద్రయాగం మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా పాల్గొన్నారు. ఈ నెల 12 నుంచి సోమేశ్వరంలో పంచాయతన సహిత మహా రుద్రయాగం నిర్వహిస్తున్న విషయం విదితమే. మంత్రి రాజా, వైఎస్సార్ సీపీ నేత జక్కంపూడి గణేష్ సోమేశ్వరస్వామి వారికి పూజాధికాలు నిర్వహించియాగంలో పాల్గొన్నారు. మంత్రి రాజా మాట్లాడుతూ లోక కల్యాణం కోరుతూ మహారుద్ర యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలుతగా మహా రుద్రయాగ కమిటీ మంత్రి రాజాను పూర్ణకుంభంతో స్వాగతించింది. ఆయనను, జక్కంపూడి గణేష్‌ను మహారుద్రయాగ కమిటీ సత్కరించింది. పదవ రోజు వందమంది వేద పండితులు మహా రుద్రయాగాన్ని నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

పలు రైళ్లు రద్దు



రాజమహేంద్రవరం సిటీ: ఖరగ్‌పూర్ సెక్షన్‌లో ఇంటర్ లాకింగ్ సిస్టం మార్పుల్లో భాగంగా జిల్లా మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటించారు. ఈ నెల 23 నుంచి మార్చి 6వ తేదీ వరకు వివిధ తేదీల్లో రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. రద్దయిన రైళ్ల వివరాలు ప్రయాణికులు తెలుసుకోవాలన్నారు.

కనిపించని పేజీ కోసం అన్వేషణ


లిబ్ నాటకంలో ఓ సన్నివేశం

- ఆలోచింపజేసిన లిబ్
- అలరించిన మూడో రోజు నాటక ప్రదర్శన

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): లిబ్ (లెట్ ఇట్ బోదర్) నాటకం ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసింది. ఎన్ఎస్‌డీ ఆధ్వర్యంలో 22వ భారత్ రంగ్ మహోత్సవంలో భాగంగా మూడో రోజు రాజమహేంద్రవరం శ్రీ ఆనం కళాకేంద్రంలో కేరళకు చెందిన అస్పోర్టివ్ థియేటర్ స్పేస్ గ్రూప్ ఈ నాటకాన్ని మంగళవారం ప్రదర్శించింది.

నాటక సారాంశం...

ఈ నాటకం మతిమరుపుతో బాధపడుతున్న ఒక లైబ్రేరియన్‌పై సాగుతుంది. మరణించిన తాత కుంజంబు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన గ్రామ గ్రంథాలయంలో జరిగే ఘటనల సమాహారంగా కథను రూపొందించారు. బ్రిటిష్ మలబార్‌లోని పల్లువనాడ్‌లోని దక్షిణ ప్రాంతానికి చెందిన చెరుప్పులస్సేరిలో జరిగిన కథగా దర్శకుడు మనకు చెబుతాడు. లైబ్రేరియన్‌కి గ్రంథాలయంలో ఒక పుస్తకం లభిస్తుంది. అది పాత పుస్తకం. పైగా దానిపై రచయిత పేరు కూడా లేకుండా అట్ట చిరిగి పోయి ఉంటుంది. ఆ పుస్తకాన్ని చూసి చదవడం ప్రారంభిస్తాడు. అయితే పుస్తకంలో ఒకచోట ఒక పేజీ మిస్ అవుతుంది. కనిపించని ఆ పేజీ కోసం అన్వేషణ మొదలు పెడతాడు. ఆ పేజీని తిరిగి సంపాదించే ప్రయత్నంలో ప్రసిద్ధులైన వారినెందరినో కలుస్తాడు. నెరుడా, షేక్స్‌పియర్, షేనా, కాఫ్కాతో సహా అనేక భాషల రచయితలతో సంభాషిస్తాడు. చివరకు లైబ్రరీ అంటే 'ఒక గతించిన జ్ఞాపకం' అని తన వెతుకులాటలో గమనిస్తాడు. కనిపించని ఆ పేజీ అతని ఆఖరి దినముగా భావించడంతో కథ ముగుస్తుంది. దర్శకుడు అలియార్ కే. ఈ నాటకాన్ని ఆద్యంతం ఉత్కంఠ భరితంగా మలిచాడు. పుస్తకంలోని సారాంశాన్ని ప్రేక్షకులకు చెప్పకుండా.. కనిపించకుండా పోయిన పేజీ వైపే కథను నడిపించాడు.

నైతిక విలువలుంటేనే భవిత



విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్న డాక్టర్ వరప్రసాదరావు

కాకినాడ క్రైం: వైద్య వృత్తిలో నైతిక విలువలుంటేనే ఉత్తమ భవిత దరి చేరుతుందని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ వరప్రసాదరావు తెలిపారు. మంగళవారం కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన ఎతిక్స్ ఎవేర్ నెస్ ప్రోగ్రాం (నైతిక విలువల అవగాహన కార్యక్రమం)కు ఆయన పరిశీలకుడి హోదాలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంగళవారం రంగరాయ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమాన్ని మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు పీజీ, యూజీ అవుట్‌గోయింగ్ విద్యార్థుల కోసం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వరప్రసాదరావు మాట్లాడుతూ, వైద్య శాస్త్రం, వృత్తిలో నైతిక విలువలు అనుసరించి తీరాల్సిన ప్రాధాన్యాన్ని వివరించారు. రోగులతో వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. వైద్య విధానాల్లో పాటించవలసిన అప్రమత్తత, నిర్లక్ష్యం వల్ల ఎదురయ్యే పర్యవసానాలను ఆయన విద్యార్థులకు వివరించి చెప్పారు. వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వల్ల ఎదురయ్యే చట్టపరమైన చిక్కులతో పాటు సేవల్లో నాణ్యత ఉంటే ఆ చిక్కుల నుంచి బయటపడే విధానాలను ఉదాహరణలతో వివరించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, డాక్టర్ దేవిమాధవి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి 240 మంది హౌస్ సర్జన్లతో పాటు 130 మంది పీజీలు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు డాక్టర్ వరప్రసాదరావు సర్టిఫికెట్లు అందజేశారు.

క్రైం కార్నర్..

337 కిలోల గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: విశాఖపట్నం నుంచి రాజస్థాన్‌కు లారీలో తరలిస్తున్న 337 కిలోల గంజాయిని బొమ్మూరు పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారయ్యారు. వివరాల్లోకి వెళితే.. రాజస్థాన్‌కు చెందిన గౌతమ్ సింగ్, నరేష్‌కుమార్ పంచారియా, మరో ఇద్దరు కలిసి నర్సీపట్నం వద్ద 15 బస్తాల 337 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. అక్కడి నుంచి రాజస్థాన్‌కు తరలిస్తుండగా దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద మంగళవారం ఉదయం బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై జగన్‌మోహనరావు, సిబ్బంది తనిఖీ చేపట్టారు. ఈ నేపథ్యంలో గంజాయిని, లారీని స్వాధీనం చేసుకున్నారు. గౌతమ్‌సింగ్, నరేష్‌కుమార్ పంచారియాలను అరెస్టు చేయగా, మరో ఇద్దరు పరారయ్యారు. ఎస్సై జగన్‌మోహనరావు కేసు నమోదు చేయగా, ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయకుమార్ దర్యాప్తు చేస్తున్నారు. దీని విలువ రూ.16.87 లక్షలు ఉంటుంది.

చీటీల మోసంపై ఫిర్యాదు

కాకినాడ రూరల్: జేఎన్‌టీయూకేలో ఉద్యోగి, కుటుంబ సభ్యులు చీటీలు నిర్వహిస్తూ సొమ్ములు ఇవ్వకుండా తమను మోసగించారని బాధితులు సర్పవరం పోలీసులను మంగళవారం రాత్రి ఆశ్రయించారు. వర్సిటీలో సివిల్ డిపార్టుమెంట్‌లో స్టోర్ కీపర్‌గా పని చేస్తున్న శేషవు శేషగిరిపై ఈ మేరకు గుంటే వెంకటలక్ష్మి తదితరులు సుమారు 17 మంది రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రూ.లక్ష, రూ.1.10 లక్షలు, రూ.లక్షన్నర చొప్పున చీటీలు పాడుకున్న సొమ్ములను చెల్లించకుండా వడ్డీ మాత్రమే చెల్లించేవారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సుమారు రూ.70 లక్షల నుంచి రూ. కోటి వరకు సొమ్ములు చెల్లించాల్సి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. దీనిపై వాస్తవాలు ఏమిటన్నది విచారణలోనే తేలుతుందని, జేఎన్‌టీయూకేలో బాధితులతో కలిసి విచారణ నిర్వహించి కేసు నమోదు చేస్తామని సీఐ మురళీకృష్ణ తెలిపారు. దీంతో బాధితులు వెనుదిరిగారు.

వేలిముద్ర ఫోర్జరీ చేసి బ్యాంకు ఖాతా నుంచి సొమ్ము దోపిడీ

ముమ్మిడివరం: యూఎస్‌లో ఉంటున్న ఓ ఎన్ఆర్ఐ ఆధార్‌కార్డు ఆధారంగా ఆయన వేలిముద్రను ఫోర్జరీ చేసి, ఆయన బ్యాంకు ఖాతాల నుంచి రూ.10వేల వరకు ఎవరో డ్రా చేశారు. ముమ్మిడివరం మండలం అయినాపురం గ్రామానికి చెందిన మల్లహోలు హరి యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఆయనకు ఎస్‌బీఐ, యాక్సిస్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాల్లో ఖాతాలున్నాయి. అయితే తన ఖాతాల్లో ఉన్న సొమ్ము తీసుకోవడం కోసం ఆధార్ అనుసంధాన వేలి ముద్రను ఎవరో ఫోర్జరీ చేసి వాటిలో ఉన్న రూ.10వేలు తీసుకున్నారని హరి తెలిపారు. వేలి ముద్రలను సైతం ఫోర్జరీ చేసి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు తీసేస్తే రక్షణ ఎలా అని హరి స్థానిక విలేకర్ల వద్ద వాపోయారు. దీనిపై నేషనల్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసినట్లు హరి మంగళవారం తెలిపారు.

పక్కింటోడే దొంగ

వేమగిరిలో చోరీ కేసు ఛేదించిన పోలీసులు


నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు, నగదు

కడియం: వేమగిరిలో మట్టపర్తి సత్యదుర్గాప్రసాద్ ఇంట్లో జరిగిన దొంగతనాన్ని కడియం పోలీసులు ఛేదించారు. పోయిన వస్తువులను తమకు ఫిర్యాదు అందిన అయిదు రోజుల్లోనే రికవరీ చేయడం విశేషం. ఈ కేసుకు సంబంధించి పోలీసులు మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపిన వివరాలి ఇలా ఉన్నాయి. ఈ నెల 10వ తేదీన ఇంటికి తాళం వేసి దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు పెళ్లికి వెళ్లారు. 15వ తేదీన వచ్చిచూసుకునే సరికి ఇంట్లోని బీరువా తాళాలు పగుల గొట్టి అందులోని ఒక జత బంగారపు చెవి బుట్టలు, చిన్నపిల్లల ఉంగరాలు, నాలుగు లక్ష్మీదేవి రూపులు, రెండ జతల వెండిపట్టీలు, ఒక వెండి మొలతాడు, వెండి కుంకుమ భరిణ, వెండి కంచం, లక్ష్మీదేవి వెండి విగ్రహం, రూ.1,05,000 నగదు మాయమైనట్లు గుర్తించి కడియం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. దీంతో కడియం పోలీసు ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ పర్యవేక్షణలో ఎస్ఐ కె.ఆంజనేయులు, పీసీలు కె.సురేష్‌బాబు, కె.లక్ష్మణ్ దర్యాప్తు ప్రారంభించారు. వేమగిరి తోటలో బాధితుల ఇంటి పక్క పోర్షన్‌లోనే నివాసం ఉండే గంటా రాజుపై అనుమానం వచ్చి, విచారణ చేశారు. దీంతో నేరం ఒప్పుకున్నాడని తెలిపారు. అతడి వద్ద నుంచి వస్తువులు, రూ.లక్ష నగదు రికవరీ చేశామన్నారు. నిందితుడిని రాజమహేంద్రవరం ఏడవ ఏజేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచ్చగా రిమాండ్ విధించారని తెలిపారు.